# 5:30 గంటలకే మాక్ పోల్

- అభ్యర్థుల ఏజెంట్ల సమక్షంలో 50 ఓట్ల పరిశీలన
- సమర్థవంతమైన నిర్వహణలో పీఓ, ఏపీఓల పాత్ర కీలకం
- శిక్షణ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ విజయలక్ష్మి



సిటీబ్యూరో, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ ) : పోలింగ్ సమర్థవంతమైన నిర్వహణలో ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారుల పాత్ర క్రియాశీలకమని తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రంలో ఎన్నికల సామగ్రిని అక్టోబర్ 29న ఆయా డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ల నుంచి తీసుకొని నేరుగా పోలింగ్ కేంద్రానికి వెళ్లాలని డిప్యూటీ కలెక్టర్ విజయలక్ష్మి తెలిపారు. సోమవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో నూతనంగా నియమించబడ్డ పీఓ, ఏపీఓలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ కలెక్టర్ విజయలక్ష్మి మాట్లాడారు. పీఓ, ఏపీఓలు పోలింగ్ రోజు ఉదయం 5:30 గంటలకు మాక్ పోల్‌ను ప్రారంభించి ఆయా పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో సుమారు 50 ఓట్లను ఈవీఎంలలో వేసి వాటిని సీఆర్‌సీ (క్లోజ్, రిజల్ట్,క్లియర్) ద్వారా క్లియర్ చేసి వారికి కేటాయించిన ప్రొఫార్మాలో నమోదు చేయాలని సూచించారు. అనంతరం ఉదయం 7గంటలకు పోలింగ్‌ను ప్రారంభించాలని చెప్పారు. పీఓ, ఏపీఓల వద్ద ఎలక్టోరల్‌కు సంబంధించిన మదర్ రోల్, సప్లమెంటరీ రోల్, ఏఎస్‌డీ , పోస్టల్ బ్యాలెట్, 80 సంవత్సరాలు పైబడిన, దివ్యాంగులకు సంబంధిత సమాచారాన్ని ముందస్తుగా పరిశీలించుకోవాలని పేర్కొన్నారు. ఈవీఎం, బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్‌లో ముందస్తుగా సాంకేతిక సమస్య వచ్చినచో సంబంధిత సెక్టోరియల్ అధికారుల ద్వారా వాటి మార్పిడికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. పోలింగ్ ప్రారంభమయ్యాక కేవలం వీవీ ప్యాట్‌లో సమస్య వచ్చినచో దానిని మాత్రమే మార్చడానికి చర్యలు తీసుకోవాలన్నారు.

పోలింగ్ రోజు టెండర్ ఓటు, చాలెంజ్ ఓటు, టెస్ట్ ఓట్లపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. పోలింగ్ ఏజెంట్ సంబంధిత ఓటరుపై అనుమానం వ్యక్తం చేసినచో ఆయా ఓట్లను ప్రత్యేకంగా నమోదు చేయాలని తెలిపారు. ఓటర్లు తమ ఎపిక్ కార్డు లేనిచో ఎన్నికల సంఘం సూచించిన 12 గుర్తింపు కార్డులలో ఏదో ఒకటి చూపించినా ఓటు హక్కు కల్పించాలన్నారు. పోల్‌ను సాయంత్రం 5 గంటలకు క్లోజ్ చేసి క్యూలో నిలబడ్డ చివరి వ్యక్తికి 1వ నంబర్ కేటాయించి వారికి ఓటు హక్కును కల్పించాలని తెలిపారు. ప్రతి రెండు గంటలకు ఒక సారి పోలింగ్ నమోదు శాతంను అధికారులకు అందించాలని తెలిపారు. విధులు నిర్వర్తిస్తున్న పోలింగ్ సిబ్బందికి అన్ని వసతులు కల్పిస్తున్నామని విజయలక్ష్మి తెలిపారు. ఈ సమావేశంలో జాయింట్ కమిషనర్ మంగతాయారు, మాస్టర్ ట్రైనర్స్ మణిపాల్, సునంద, వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 25 మంది అభ్యర్థులు.. 27 నామినేషన్లు

## ఎన్నికల అధికారి రోనాల్డ్‌రాస్

సిటీబ్యూరో, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ ): శాసనసభకు జరిగే ఎన్నికలకు హైదరాబాద్ జిల్లాలో సోమవారం 25 మంది అభ్యర్థులు 27 నామినేషన్లు దాఖలు చేయగా.. మొత్తం 47 నామినేషన్లు, 42 మంది దాఖలు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్ తెలిపారు. ముషీరాబాద్ నియోజకవర్గంలో రెండు నామినేషన్లు దాఖలు చేయగా..అందులో ఇండిపెండెంట్ అభ్యర్థి రెడ్డి మల్ల పార్వతి, ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థి ముత్యాల రాజేశ్ నామినేషన్ వేశారు. మలక్‌పేట్ నియోజకవర్గంలో ఏఐఎంఐఎం పార్టీ అభ్యర్థి అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల, ఇండిపెండెంట్ అభ్యర్థులు ఎల్.అశోక్ నాథ్, భార్గవి కజాయం, పోల్కం శ్రీనివాస్, మహ్మద్ అక్రం అలీ ఖాన్ నామినేషన్లు వేశారు. అంబర్‌పేట్ నియోజకవర్గంలో ఇండిపెండెంట్ అభ్యర్థి పొన్నపాటి చిన్న లింగన్న నామినేషన్ దాఖలు చేశారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలో రెండు నామినేషన్లు కాగా యుగ తులసి పార్టీ అభ్యర్థి డి.నాగరాజు, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పాల్ సత్యానందన్ డేవిడ్ నామినేషన్లు వేశారు. సనత్‌నగర్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి సగ్రరావు శ్రీశైలం, నాంపల్లి నియోజకవర్గంలో ఏఐఎంఐఎం పార్టీ అభ్యర్థి మహ్మద్ మాజీద్ హుస్సేన్, కార్వాన్ నియోజకవర్గంలో ఏఐఎంఐఎం పార్టీ అభ్యర్థి కౌసర్ మొయినుద్దీన్ నామినేషన్ దాఖలు చేశారు. గోషామహల్ నియోజకవర్గంలో మూడు నామినేషన్లు దాఖలు కాగా అందులో ప్రజా ఏక్తా పార్టీ అభ్యర్థి బి.శ్రీనివాస్, ఏఐఎంఐఎం పార్టీ అభ్యర్థి మహ్మద్ అబ్దుల్ అజీమ్, బీఎస్పీ పార్టీ అభ్యర్థి కళ్యాణి నందేశ్ కుమార్ నామినేషన్లు వేశారు. చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలో ఐఎన్‌సీ పార్టీ అభ్యర్థి బి.నగేశ్, బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి ముప్పిడి సీతారాం రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. యాకత్‌పుర నియోజకవర్గంలో మూడు నామినేషన్లు దాఖలు కాగా ఏఐఎంఐఎం పార్టీ అభ్యర్థి జాఫర్ హుస్సేన్ రెండు సెట్లు, విద్యార్థుల రాజకీయ పార్టీ అభ్యర్థి ఎన్.అనిల్ కుమార్ ఒక సెట్ నామినేషన్ వేశారు. బహదూర్‌పుర నియోజకవర్గంలో మూడు నామినేషన్లు దాఖలు కాగా అందులో జై మహా భారత్ పార్టీ అభ్యర్థి షేక్ షహీన్, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాజేశ్ కుమార్ పులిపాటి, బీజేపీ పార్టీ అభ్యర్థి వై.నరేశ్ నామినేషన్లు దాఖలు చేశారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలో ఇండిపెండెంట్ అభ్యర్థి రాహుల్ గుప్తా కోడారపు రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. కంటోన్మెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వెన్నెల జీ.వి నామినేషన్ వేశారు. కాగా ఎన్నికల సంఘం జారీ చేసిన నోటిఫికేషన్‌ను అనుసరించి ఈ నెల 10వ తేదీ వరకు స్వీకరించే నామినేషన్లను మధ్యాహ్నం 3 గంటల వరకు సంబంధిత రిటర్నింగ్ అధికారి కార్యాలయాల్లో అభ్యర్థులు దాఖలు చేయాల్సి ఉంటుంది.

## మేడ్చల్ జిల్లాలో ఏడు నామినేషన్లు

మేడ్చల్, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ): మేడ్చల్– మల్కాజిగిరి జిల్లాలో మూడో రోజు సోమవారం ఏడు నామినేషన్లు దాఖలయ్యాయి. జిల్లాలో మేడ్చల్ నియోజకవర్గంలో 1, కుత్బుల్లాపూర్‌లో 1, కూకట్‌పల్లిలో 3, ఉప్పల్ నియోజకవర్గంలో 2 నామినేషన్లు దాఖలైనట్లు జిల్లా కలెక్టర్ గౌతమ్ వెల్లడించారు. మల్కాజిగిరి నియోజకవర్గం నుంచి ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదన్నారు. నామినేషన్ల ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకు 19 నామినేషన్లు దాఖలైనట్లు వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా నామినేషన్ల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ గౌతమ్ పేర్కొన్నారు.

## వృద్ధులకు సహాయం కోసం శిక్షణ

- శిక్షణ ఇవ్వడానికి సంస్థలు, ఆశ్రమాల నుంచి దరఖాస్తులు
- నోటిఫికేషన్ జారీ..

సిటీబ్యూరో, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో వృద్ధులకు సహాయం చేయడానికి నిర్దేశించిన జెరియాట్రిక్ శిక్షణ సహాయకులకు శిక్షణ ఇవ్వడం కోసం పలు సంస్థలు, ఆశ్రమాల నుంచి దరఖాస్తులు కోరుతూ సోమవారం జిల్లా వికలాంగుల, వయోవృద్ధుల శాఖ డైరెక్టర్ నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ మేరకు దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 13న సాయంత్రం 5 గంటల వరకు గడువు విధించారు. పూర్తి వివరాల కోసం నాంపల్లిలోని మనోరంజన్ కాంప్లెక్స్‌లో ఉన్న వయోవృద్ధుల శాఖ అధికారిని సంప్రదించాలని సూచించారు. లేదా వివరాలకు 964045 2773 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

## ఎంఎన్‌జేలో అందుబాటులోకి రానున్న రోబో సేవలు

### రోబో శస్త్రచికిత్సలపై సర్జన్లకు పూర్తికావచ్చిన శిక్షణ

సిటీబ్యూరో, నవంబర్ 6(నమస్తే తెలంగాణ): ఎంఎన్‌జే క్యాన్సర్ దవాఖానలో క్యాన్సర్ రోగులకు త్వరలోనే రోబో సేవలు అందుబాటులోకి రానున్నాయి. రోబో శస్త్రచికిత్సలకు సంబంధించి 20మంది నిష్ణాతులైన సర్జికల్ ఆంకాలజిస్టు నిపుణులను ఎంపిక చేయగా.. వారిలో ఇప్పటికే నలుగురు సర్జన్లు శిక్షణ పూర్తిచేసుకున్నట్లు అధికారులు తెలిపారు. దశల వారీగా సర్జన్లకు శిక్షణ అందిస్తున్నట్లు ఎంఎన్‌జే డైరెక్టర్ డా.జయలత పేర్కొన్నారు. రోబో సేవలు అందుబాటులోకి వస్తే ప్రతి రోజు రెండు నుంచి మూడు క్రిటికల్ సర్జరీలు చేయవచ్చన్నారు. రోబో వల్ల పేద రోగులకు మరింత మెరుగైన, వేగవంతమైన శస్త్రచికిత్సలు అందుతాయన్నారు. రోబో అందుబాటులోకి వస్తే రోజుకు రెండు నుంచి మూడు అత్యంత క్లిష్టమైన సర్జరీలను అదనంగా చేసే వీలుంటుందని తెలిపారు.

## రైల్వే ట్రాక్‌ను దాటడం తీవ్ర నేరం

### ఎస్‌సీఆర్ జోనల్ జీఎం వెల్లడి..

సిటీబ్యూరో, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ) : రైల్వే ట్రాక్‌లను దాటడం తీవ్ర నేరమని, ఇది ప్రజల భద్రతకు ప్రమాదం కలిగిస్తుందని దక్షిణ మధ్య రైల్వే జోన్ జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ అన్నారు. ఈ మేరకు సోమవారం జోన్ ఆధ్వర్యంలో ఉన్న ఆరు డివిజనల్ రైల్వే మేనేజర్లతో జీఎం వీడియో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైల్వే ట్రాక్‌లను ప్రజలు దాటడం వల్ల వారి భద్రతకు ఇబ్బందులు ఏర్పడే అవకాశాలు ఉన్నాయన్నారు. అలాగే రైళ్ల రాకపోకలు సక్రమంగా జరగడంలో కూడా అనేక ఆటంకాలు ఏర్పడుతాయన్నారు. ఈ సందర్భంగా రైలు ప్రయాణిస్తున్న సమయంలో ఒక ట్రాక్టర్ రైల్వే ట్రాక్‌పై ఇరుక్కుపోవడం వంటి ఘటనను ఆయన అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. లెవల్ క్రాసింగ్ వద్ద రైల్వే ట్రాక్‌లు దాటుతున్నప్పుడు అనుసరించాల్సిన భద్రతా విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.



బీజేపీ నుంచి బీఆర్‌ఎస్‌లోకి చేరికలు

కుత్బుల్లాపూర్ డివిజన్ బీజేపీ సీనియర్ నాయకుడు ఇన్నారెడ్డి తన అనుచరులతో కలిసి సోమవారం ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, మాజీ కార్పొరేటర్ కేఎం. గౌరీశ్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఆయన వెంట నరసయ్య, రోశయ్య, బాలాజీ, వెంకట్ రెడ్డి, నాయుడు, పత్తి రాములు, నారా శ్రీనివాస్, హెచ్‌ఎంటీ చారి, మురళీకృష్ణ, కోటేశ్వర్‌రావు, వెంకటేశ్వర్‌రావు, నీలకంఠ, నాగిరెడ్డి, చారి, ప్రకాశ్‌రావు, శ్రీనివాస్‌రావు, తాజాబాయ్, శంకర్ తదితరులు ఉన్నారు. – కుత్బుల్లాపూర్, నవంబర్6

## హవాలా నగదు ట్రాన్స్‌పోర్టర్లపై స్పెషల్ ఫోకస్

### కొత్త కొత్త ప్రాంతాలలో ఆకస్మిక చెక్‌పోస్టులు

సిటీబ్యూరో, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ): ఎన్నికలు వచ్చాయంటే హవాలాలో నగదు రవాణా చేసే వారికి గిరాకీ ఉంటుంది. దీంతో పోలీసులు హవాలా రవాణా చేసే వారిపై ఫోకస్ పెట్టారు. ఇందులో దందా నిర్వహించే వారు ఒకరైతే, నగదును అక్రమ రవాణా చేసే వాళ్లు ఇంకొకరు. గత నెలలో కేంద్ర ఎన్నికల సంఘం అసెంబ్లీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేసిన వెంటనే పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో భారీగా హవాలా డబ్బు పట్టుబడింది. ఈ నేపథ్యంలో పోలీసులు నిఘాను పటిష్టం చేశారు. హవాలా ఏజెంట్లు తమ రూట్లను మారుస్తుండటంతో పోలీసులు కూడా తనిఖీలు ఒకే చోట కాకుండా వేరు వేరు ప్రాంతాల్లో చేపడుతున్నారు. పోలీసులు ఎప్పటికప్పుడు కొత్త కొత్త రూట్లలో చేపడుతున్న తనిఖీలు హవాల ట్రాన్స్‌పోర్టర్లలో గుబులు పుట్టిస్తున్నాయి.

### ట్రాన్స్‌పోర్టర్లే కీలకం..

సాధారణ సమయాల్లో పక్కా సమాచారంతోనే పోలీసులు హవాలా సొమ్మును పట్టుకుంటారు. అయితే ఇక్కడ దందా నిర్వహించే వారు తీసుకునే కమీషన్లలో నామమాత్రంగా ఏజెంట్ ట్రాన్స్‌పోర్టర్‌లకు ఇచ్చేవారు. ఇప్పుడు ఎన్నికల వేల అక్రమ మార్గంలో నగదు రవాణా చేయడం రిస్క్‌తో కూడుకున్న పని. డబ్బు పట్టుబడితే ఎక్కడి నుంచి వస్తుందో సమాచారం ఇస్తారు, కానీ ఎవరికి అందించాలో మాత్రం చెప్పరు. దీంతో రాజకీయ నాయకుల పేర్లు బయటకు వచ్చే అవకాశాలు తక్కువగా ఉంటాయి. ఇలాంటి రిస్క్‌తో కూడుకున్న నగదు రవాణాకు హవాలా ఏజెంట్లు కమిషన్లను ఎక్కువగా ఆశిస్తున్నారు. ఇందులో టాన్స్‌పోర్టర్‌ల పాత్ర కీలకంగా మారింది. చాలా మంది ఈ దందా నిర్వహించే వారు రిస్క్‌తో కూడుకున్న పనులు ఇప్పుడు అవసరం లేదనే భావనలో ఉండగా... అత్యవసరమైనప్పుడు మీరు మాకు హవాలా ద్వారా డబ్బు సమకూర్చుకుంటే భవిష్యత్తులో మీతో దందా చేయమని తేగేసి చెబుతున్నారట. ఈ క్రమంలోనే నగదు రవాణా చేసే వారికి ఎంతైనా కమీషన్ ఇచ్చేందుకు ముందుకొస్తున్నారని సమాచారం. దీంతో హవాలా ఏజెంట్లు ఒకేసారి మొత్తం నగదుతో కాకుండా తక్కువ మొత్తంలో నగదును గమ్యస్థానాలకు చేర్చే పనిలో ఉన్నట్లు సమాచారం. దందా నిర్వహించే వారు కొత్త ఎత్తులతో వస్తారనే విషయంపై నిఘా సంస్థలు పోలీసులను హెచ్చరించాయి. దీంతో పోలీసులు సైతం హవాలా సొమ్ము రవాణా కాకుండా ఉండేందుకు పకడ్బందీగా చర్యలు చేపడుతున్నారు.

## తొలగించిన 26 బీసీ కులాలను పునరుద్ధరించాలి




మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఆళ్ల రామకృష్ణ

రవీంద్రభారతి, నవంబర్ 6 : రాష్ట్రంలో బీసీ జాబితా నుంచి తొలగించిన 26 కులాలను తిరిగి పునరుద్ధరించాలని 26 కులాల పోరాట సమితి అధ్యక్షుడు ఆళ్ల రామకృష్ణ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సమితి నేతలతో కలిసి రామకృష్ణ మాట్లాడుతూ... నిజాం పాలన నుంచి కొన్ని దశాబ్దాలుగా తెలంగాణలో కొన్ని ఆంధ్రా ప్రాంతానికి చెందిన అణగారిన బీసీ కులాలు జీవనం కొనసాగిస్తున్నాయని, ఉమ్మడి రాష్ట్ర విభజన తరువాత తరతరాలుగా తెలంగాణలో నివసిస్తున్న ఆంధ్రా ప్రాంతానికి చెందిన అత్యంత వెనుకబడిన 26 బీసీ కులాలను తొలగించారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ తమ బాధను అర్థం చేసుకొని తొలగించిన 26 బీసీ కులాలను మళ్లీ పునరుద్ధరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, ఎంఆర్‌కే రెడ్డి, ప్రసాద్, చిత్తూరు వేణు, జె.వెంకటేశ్వర్‌రావు, మురళీధర్, టి. శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.